# తప్పని ఎదురుచూపులు

- కొత్త రేషన్‌కార్డుల ఊసెత్తని ప్రభుత్వం
- సచివాలయం చుట్టూ పేదల ప్రదక్షిణలు
- సంక్షేమ పథకాలు అందవని ఆందోళన

**అవుకు:** రేషన్‌కార్డుల కోసం పేదలు ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు దాటినా రేషన్ కార్డులపై ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో పేదలు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. అర్హులైన పేదలు కార్డుల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయితే సచివాలయ సిబ్బంది మాత్రం ప్రభుత్వం నుంచి తమకు ఆదేశాలు రాలేదని చెప్పడంతో లబ్ధిదారులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. ఓ పక్క కొత్త కార్డులు ఇవ్వకపోగా, ఉన్న కార్డుల్లో చేర్పులు, మార్పులు అనుమతి కూడా ఇవ్వకపోవడంతో కూటమి ప్రభుత్వంపై అర్హులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**అన్నీ హామీలే.. ఆచరణ శూన్యం**

ఎన్నికల సమయంలో అధికారం కోసం అనేక హామీలు ఇచ్చిన కూటమి నాయకులు తీరా అధికారంలోకి వచ్చాక వాటిని పట్టించుకోవడంలేదు. ప్రభుత్వం నుంచి ఎలాంటి సంక్షమ పథకాలు అందాలన్నా రేషన్ కార్డులే ప్రధాన ఆధారం. కార్డులు మంజూరు చేయడంలో కూటమి ప్రభుత్వం జాప్యం చేస్తుండడంతో ప్రజలు మండిపడుతున్నారు. 2014–2019 మధ్య టీడీపీ అధికారంలో



ఉన్న సమయంలోనూ ఇదే విధంగా రేషన్‌కార్డులు మంజూరు చేయకుండా ఇబ్బందులకు గురిచేసింది. అప్పట్లో కొత్త రేషన్ కార్డులు కావాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ అర్హులు ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. ఈ కారణంతో ఎంతో మంది అర్హులకు అన్యాయం జరిగింది. కూటమి ప్రభుత్వంలో ఇవే కష్టాలు ఏర్పడడంతో పేదలు ఆందోళన చెందుతున్నారు. రేషన్ కార్డుల దరఖాస్తులకు అనుమతి వచ్చినా గ్రామ నేతల సిఫార్సు ఉంటేనే కార్డులు వస్తాయని చర్చించుకుంటున్నారు.

**వైఎస్సార్‌సీపీ పాలనలో నిరంతర ప్రక్రియ**

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులందరికీ ఎప్పటికప్పుడు రేషన్ కార్డులు అందేవి. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు అర్హుల ఇళ్ల వద్దకే వెళ్లి దరఖాస్తు చేయించే వారు. ఎవరితో సంబంధం

| మండలం | సచివాలయాలు | రేషన్ షాపులు | రేషన్ కార్డులు |
|---|---|---|---|
| అవుకు | 18 | 41 | 15,800 |
| బనగానపల్లె | 25 | 58 | 30,685 |
| కోవెలకుంట్ల | 12 | 34 | 13,859 |
| సంజామల | 11 | 32 | 12,287 |
| కొలిమిగుండ్ల | 16 | 44 | 16,067 |

లేకుండా సంక్షేమ పథకాలు నేరుగా వచ్చేవి. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసింది. వలంటీర్ల వ్యవస్థ లేకపోవడంతో గ్రామస్థాయిలో ఏ విధంగా దరఖాస్తు చేసుకోవాలో తెలియక ఎంతో మంది ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం మాటలతో కాలయాపన చేస్తుందే తప్ప ప్రజలకు ఒక్క పని కూడా కావడం లేదు. 10 నెలల్లో ఎందరికో వివాహాలు అయ్యాయి. కుటుంబంలో కొత్త సభ్యులు వచ్చారు. వీరంతా ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరితో ఇబ్బందులు పడుతున్నారు. అన్ని అర్హత ఉన్నా రేషన్ కార్డు మంజూరు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలు వెబ్‌సైటే పనిచేయకపోవడంతో ప్రభుత్వంపై మండిపడుతున్నారు.

### ఎప్పుడు మంజూరు చేస్తారో



ప్రతి పనికి రేషన్‌కార్డు అవసరం ఉంటుంది. కూటమి ప్రభుత్వం అధికరంలోకి వచ్చి పది నెలలు పూర్తికావస్తున్నా ఇప్పటి వరకు కొత్త రేషన్ కార్డుల ఊసేలేదు. సచివాలయంలో అడిగితే ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని చెబుతున్నారు. అసలు సైటే ఓపెన్‌కావడం లేదని చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి కొత్త రషన్ కార్డుల మంజూరుకు మార్గదర్శకాలు జారీ చేయాలి. వీలైనంత త్వరగా కార్డులు మంజూరు చేసి పేదలను ఆదుకోవాలి. –మంచాల నాగేశ్వరరెడ్డి, సుంకేసుల

### కార్డుల కోసం నిరీక్షణ



గత ప్రభుత్వ హయాంలో గంటల వ్యవధిలోనే రేషన్ కార్డులు వచ్చేవి. వలంటీర్లు అర్హులైన వారి ఇంటికి వచ్చి కార్డుల కోసం దరఖాస్తు చేయించేవారు. ప్రస్తుతం రేషన్‌కార్డుల కోసం ఎంతో మంది ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇన్ని నెలలు అయినా కొత్తకార్డుల మంజూరుపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కనీసం మార్పులు, చేర్పులకు కూడా అవకాశం ఇవ్వకుండా లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

–మధు, ఓబుళాపురం, అవుకు

## క్లుప్తంగా

### స్మార్ట్‌టాయ్‌లెట్ల నిర్మాణం పూర్తి



మహిళలతో రామ్‌కో ప్రతినిధులు

**కొలిమిగుండ్ల:** మండల పరిధిలోని చింతలాయిపల్లెలో రామ్‌కో సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్మించిన స్మార్ట్ టాయ్‌లెట్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. సోమవారం కంపెనీ ప్రతినిధులు పీఆర్వో భరత్‌రెడ్డి, సీఎస్సార్ అఖిల్ ప్రారంభోత్సవం చేసి మహిళలకు శానిటరీ న్యాప్‌కిన్స్ అందజేశారు. గ్రామంలో రూ.25లక్షలతో 50 స్మార్ట్ టాయ్‌లెట్లను నిర్మించినట్లు ప్రతినిధులు పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లు ఉపయోగించాలనే ఉద్దేశంతో కంపెనీ చుట్టు పక్కల గ్రామాల్లో లబ్ధిదారులను ఎంపిక చేసి నిర్మాణాలు చేపట్టిందని చెప్పారు.

### సేవ చేయడం మానవ ధర్మం



పింఛన్ అందజేస్తున్న ప్రకృతి పీఠం అధ్యక్షుడు

**కోవెలకుంట్ల:** ప్రతి ఒక్కరూ సేవా గుణం అలవర్చుకుని తమ సంపాదనలో కొంత మొత్తాన్ని దాన ధర్మాలకు వినియోగించాలని ప్రకృతిపీఠం అధ్యక్షుడు పల్లె నరసింహారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక పరంధామ నిలయంలో పట్టణానికి చెందిన 150 మంది అనాథలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు రూ.100 చొప్పున పింఛన్లు పంపిణీ చేశారు. 14 ఏళ్లుగా ప్రతి నెలా పేదలకు తమ వంతు సాయంగా పింఛన్లు అందజే స్తున్నామన్నారు. పీఠం ఉపాధ్యక్షురాలు సుబ్బలక్ష్మమ్మ, రిటైర్డ్ హెచ్‌ఎం నారాయణస్వామి, సభ్యులు వెంకటేశ్వరరెడ్డి, మహేశ్వరరెడ్డి, రాములమ్మ, నరసింహులు పాల్గొన్నారు.

### ఓహెచ్‌ఆర్ ట్యాంకులు ప్రారంభం



ఇల్లూరుకొత్తపేటలో ట్యాంకును ప్రారంభించిన మంత్రి బీసీ

**బనగానపల్లె రూరల్:** ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీటి సౌకర్యం కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఇల్లూరు కొత్తపేట గ్రామంలో 60 వేల లీటర్ల సామర్థ్యం, రాళ్లకొత్తూరు గ్రామంలో 40 వేల లీటర్ల సామర్థ్యంతో నిర్మించిన ఓహెచ్‌ఆర్ ట్యాంకులను మంత్రి ప్రారంభించారు. జల్‌జీవన్ పథకం కింద ఇల్లూరుకొత్తపేటలో రూ.35.60లక్షలు, రాళ్లకొత్తూరులో రూ.31.50 లక్షలతో నిర్మించినట్లు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మధుసూదన్‌రావు, ఏఈ సాయికృష్ణ, తహసీల్దార్ నారాయణరెడ్డి, ఎంపీడీఓ వెంకటరమణ పాల్గొన్నారు.

### కార్మికుల హక్కుల కోసం పోరాటం



సీఐటీయూ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

**ప్యాపిలి:** కార్మికుల హక్కుల సాధన కోసం అలుపెరుగని పోరాటాలు చేస్తామని సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి చిన్న రహిమాన్ అన్నారు. మండల పరిధిలోని జలదుర్గం గ్రామంలో సోమవారం ప్రపంచ కార్మిక వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరణ చేశారు. 1886 మే 1వ తేదీ నుంచి కార్మికులకు 8 గంటల పనివిధానం అమలులోకి వచ్చిందన్నారు. కార్మికులకు నెలకు రూ.26 వేలు కనీస వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను సైతం కేంద్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టిందన్నారు. కార్మికులపై నిర్లక్ష్యంగా వహించే ప్రభుత్వాలకు బుద్ధి చెప్పడమే సీఐటీయూ ధ్యేయం అన్నారు. వివిధ సంఘాల నాయకులు రామ్మోహన్, పద్మశాలి శ్రీనివాసులు, గంగాధర్, నబిరసూల్, పీరాంబీ, లక్ష్మీదేవి, మధు పాల్గొన్నారు.

### నేడు నీటి సరఫరాలో అంతరాయం

**బనగానపల్లె రూరల్:** పట్టణంలోని భానుముక్కలలో మంగళవారం నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని గ్రామ పంచాయతీ ఈఓ సతీష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కొండపేటలోని బ్రిడ్జి సమీపంలో ఉన్న సంపు శుభ్రం చేస్తుండడంతో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నీటి సరఫరా ఉండదన్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి యథావిధిగా నీటి సరఫరా ఉంటుందని తెలిపారు. నాయక్‌వాడి మసీదు, శివాలయం వీధి, సుంకులమ్మ గుడి, నాలుగు స్తంభాల మసీదు, పెద్దపీర్లా చావిడి, హరిజనపేట, అమ్మవారిశాల వీధి, పింజరిపేట, చాకలిపేట కాలనీల ప్రజలు సహకరించాలని కోరారు.

## సంస్కరణలతో పాఠశాల విద్యకు నష్టం



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు



బనగానపల్లె: తహసీల్దార్ కార్యాలయం వద్ద..

**కోవెలకుంట్ల:** విద్యారంగంలో ప్రభుత్వం చేపట్టే సంస్కరణలతో గందరగోళ పరిస్థితులు నెలకొని పాఠశాల విద్యకు నష్టం వాటిల్లే ప్రమాదముందని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివయ్య అన్నారు. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ, ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలని కోరుతూ సంఘం నాయకులతో కలిసి సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ప్రభుత్వం 9 రకాల పాఠశాలలను ఏర్పాటు చేయడానికి ఒక్కో రకమైన విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తిని ప్రకటించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు మోడల్ ప్రాథమిక పాఠశాల లేదా, బేసిక్ ప్రాథమిక పాఠశాల కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో 6,7 తరగతులు ఉన్న చోట నాలుగు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు, 6,7,8 తరగతులు ఉన్న చోట ఆరు పోస్టులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, బదిలీలు, పదోన్నతులకు మ్యానువల్ కౌన్సిలింగ్ విధానం కొనసాగించాలని, 12వ పీఆర్సీని నియమించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయ సంఘం నాయకులు శ్రీనివాసులు, వేదవ్యాస్, హమీద్‌బాషా, సతీష్‌కుమార్, శివశంకర్ పాల్గొన్నారు.

**సీపీఎస్ రద్దు చేయాలి**

**బనగానపల్లె రూరల్:** సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం కొనసాగించాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జాకీర్ హుస్సేన్, హరినాథ్‌గౌడ్ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యలో సంస్కరణల పేరుతో గందరగోళ పరిస్థితులు కల్పిస్తోందన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న సంస్కరణలు, విధానాలతో పాఠశాల విద్యకు నష్టం కలుగుతుందన్నారు. 12వ పీఆర్‌సీ కమిషన్ నియమించి 30శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. సంఘం నాయకులు రామకృష్ణ, రంగనాయకులు, ఓబయ్య, సురేష్, మధు, రాజేష్‌గౌడ్, చంద్రశేఖర్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

## విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులను అభినందిస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ

**బేతంచెర్ల:** విద్యార్థులు తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, ఎంఈఓ సోమశేఖర్ అన్నారు. సోమవారం పట్టణంలోని అమ్మవారిశాలలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కందగడ్డల జనార్దన్, వాసవీ క్లబ్ అధ్యక్షుడు సుధీర్ ఆధ్వర్యంలో ఈ ఏడాది 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులను శాలువతో సత్కరించారు. జ్ఞాపికతో పాటు దాత సూర్య బళ్లాని సహకారంతో రూ. 30 వేల విలువ చేసే ట్రాలీ సూట్‌కేసులను అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు గుండా గోపాలు, రామూర్తి, రాజేష్, సతీష్, విష్ణు, సురేంద్ర, రమణ పాల్గొన్నారు.

## వ్యక్తిపై దాడి

**సంజామల:** పాత కక్షలు మనసులో పెట్టుకుని వ్యక్తిపై దాడి చేసిన ఘటన మండల పరిధిలోని కానాల గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన యాకోబు ఆదివారం ఉదయం తన ఆటోలో కూలీలను ఎక్కించుకుని వెళ్తుండా అదే గ్రామానికి చెందిన తలారి వెంకటేశ్వర్లు, మరో ఎనిమిది మంది ఆటోను అడ్డుకుని విచక్షణ రహితంగా కట్టెలతో కొట్టారు. తీవ్ర గాయాలు కావడంతో నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం యాకోబు కుటుంబ సభ్యులు పోలీసులను సంప్రదించారు. కులం పేరుతో దూషించి దాడి చేశారని.. వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. విచారించి తగు చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

## హంతకుడిని కఠినంగా శిక్షించాలి



ఆందోళన చేస్తున్న ఆవాజ్ కమిటీ నాయకులు

**ప్యాపిలి:** తూర్పు గోదావరి జిల్లాలో షేక్ వలిబాషా అనే వ్యక్తిని హతమార్చిన సిరంగుల అనిల్‌కుమార్‌ను కఠినంగా శిక్షించాలని ఆవాజ్ కమిటీ నియోజకవర్గ అధ్యక్షుడు జలదుర్గం రసూల్ డిమాండ్ చేశారు. జలదుర్గం గ్రామంలో సోమవారం ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. అనిల్ కుమార్ అనే వ్యక్తి తన కుమార్తెను వేధించాడని బాలిక తండ్రి వలిబాషా 2021లో పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు. పోలీసులు నిందితుడిపై అప్పట్లో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారన్నారు. ఈ కేసు తదుపరి విచారణ ఈ నెల 25న ఉండగా నిందితుడు ఆదివారం వలిబాషాను హత్య చేశాడన్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలన్నారు.

### 11 నుంచి క్రికెట్ పోటీలు

**కొలిమిగుండ్ల:** వేసవి సెలవుల సందర్భంగా కల్వటాలలో ఈనెల 11వ తేదీ నుంచి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సోమవారం తెలిపారు. పదో తేదీలోగా రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రధాన రహదారి పక్కనే బస్టాప్ సమీపంలోని మైదానంలో పోటీలు జరుగుతాయన్నారు. గెలుపొందిన జట్లకు మొదటి బహుమతి రూ.20వేలు, రెండో బహుమతి రూ.10వేలు, మూడో బహుమతి రూ.5వేలు అందించనున్నట్లు తెలిపారు. వివరాలకు 7702736610, 7893527635 నంబర్లను సంప్రదించాలని కోరారు.

### నగర పంచాయతీ పరిశుభ్రతకు సహకరించాలి

**బేతంచెర్ల:** నగర పంచాయతీ పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కమిషనర్ హరిప్రసాద్ కోరారు. ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు, కంప చెట్లు పెరిగి మూగజీవాలు, పాములు, దోమలకు నిలయంగా మారాయన్నారు. యజమానులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అలాగే చికెన్, మటన్, చేపల వ్యాపారులు వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయడం వల్ల దుర్గంధం వ్యాపిస్తోందని.. రోడ్లపై కుక్కలు, పందులు బెడద ఎక్కువయ్యాయని తెలిపారు. షాపు వద్దకు వచ్చే పారిశుద్ధ్య కార్మికులకు వ్యర్థాలను అందజేయాలన్నారు. అలాగే పందులను పట్టణానికి దూరంగా షెడ్లు ఏర్పాటు చేసుకుని అక్కడ ఉంచాలన్నారు. లేకపోతే 1965 పురపాలక చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### విద్యుత్ లేక తాగునీటికి ఇక్కట్లు

**బనగానపల్లె:** ఇల్లూరుకొత్తపేట సబ్‌స్టేషన్ పరిధిలోని మిట్టపల్లి ఫీడర్ ద్వారా సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ లేకపోవడంతో తాగునీటి సరఫరా నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సబ్‌స్టేషన్‌లో విద్యుత్ బ్రేకర్ సమస్య అంటూ మధ్యాహ్నం ఒంటి గంటకు సాంకేంతిక లోపాన్ని సరిదిద్దారు. ఆ తరువాత లైన్ సమస్య అంటూ విద్యుత్ సరఫరా చేయకపోవడంతో గ్రామస్తులు అవస్థలు పడాల్సి వచ్చింది. ఈ విషయంపై విద్యుత్ ఏడీ మద్దిలేటిని వివరణ కోరగా సక్రమంగా విద్యుత్ సరఫరా చేసేందుకు యత్నిస్తామని సమాధానం ఇచ్చారు.

### ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**అవుకు:** ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని అవుకు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు అన్నారు. అవుకు ఐటీఐలో ఏడాది కోర్సులైన కంప్యూటర్, వెల్డర్, డీజిల్ మెకానిక్‌తో పాటు రెండేళ్ల కోర్సులైన ఫిట్టర్, మోటార్ వెహికల్ మెకానిక్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, ఎలక్ట్రీషన్, ఎలక్ట్రానిక్స్ అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ఆసక్తి గలవారు ఈనెల 24వ తేదీలోపు iti.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌ను 26వ తేదీలోపు ఏదైనా ప్రభుత్వ ఐటీఐలో వెరిఫికేషన్ చయించుకోవాలని అన్నారు. అనంతరం జూన్ 2వ తేదీ నుంచి 10వ తదీ వరకు డోన్ ప్రభుత్వ ఐటీఐలో జరిగే కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని సూచించారు.

## డిమాండ్ల పరిష్కారానికి దశలవారీ ఉద్యమం





కోవెలకుంట్ల, డోన్‌లో తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

**కోవెలకుంట్ల:** తమ డిమాండ్లు పరిష్కరించే వరకు దశలవారీ ఉద్యమం కొనసాగిస్తామని నేషనల్ మజ్దూర్ యూనియన్(ఎన్‌ఎంయూ) జిల్లా కార్యదర్శి శివరాం అన్నారు. కోవెలకుంట్ల ఆర్టీసీ డిపో కార్మికులు సోమవారం తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఆర్టీసీ ఉద్యోగులకు 1/2019 సర్క్యులర్ అమలు చేయాలని, నైట్ సర్వీస్ అలవెన్స్‌ను రూ. 150 నుంచి రూ. 400లకు పెంచాలని, అక్రమ సస్పెన్షన్లు ఎత్తి వేయాలని కోరారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని, ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, ఈహెచ్‌ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని అమలు చేయాలన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థ పరంగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. యూనియన్ డిపో అధ్యక్షుడు ఆచారి, కార్యదర్శి నరసింహులు, నాయకులు పుల్లారెడ్డి, రాముడు, కాశన్న, గురప్ప, ఎంవీఎన్‌రెడ్డి పాల్గొన్నారు.

**సమస్యలు పరిష్కరించాలని వినతి**

**డోన్ టౌన్:** ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ డిపో కార్యదర్శి బాలమద్దయ్య విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం డోన్ తహసీల్దార్ నాగమణిని కలిసి వినతి పత్రం అందజేశారు. యూనియన్ డిపో అధ్యక్షుడు కేవీ రామయ్య, సహాయ కార్యదర్శి నాగార్జున, నాయకులు రామకృష్ణ, సుబ్బరాయుడు, రంగయ్య ఉన్నారు.



బనగానపల్లెలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌ఎంయూ నాయకులు

- **బనగానపల్లె రూరల్:** తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎన్‌ఎంయూ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులు సోమవారం తహసీల్దార్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. అక్రమ సస్పెన్షన్లు ఎత్తి వేయాలని.. మహిళా ఉద్యోగులకు పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. డిపో కార్యదర్శి శ్రీనివాసులు, అధ్యక్షుడు జములయ్య, గఫర్, ఎల్లయ్య, ప్రహ్లాద్ పాల్గొన్నారు.

## ప్యాపిలిలో నీటి ఎద్దడి



నంద్యాల నీటి పథకం సంపు

**ప్యాపిలి:** మండల కేంద్రానికి తాగునీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన నంద్యాల నీటి పథకం (సీపీడబ్ల్యూఎస్ స్కీం) పడకేసింది. దీంతో మూడు రోజులుగా ప్యాపిలిలో తాగునీటి ఎద్దడి నెలకొంది. అనంతపురం జిల్లా పామిడి నుంచి ప్యాపిలికి ఈ పథకం ద్వారా పైప్‌లైన్లను అమర్చి నీటిని సరఫరా చేస్తున్నారు. పట్టణ ప్రజలకు వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ఈ పథకం ద్వారానే నిరంతరం నీటి సరఫరా జరుగుతుంది. అయితే మూడు రోజుల క్రితం పైప్‌లైన్‌కు లీకేజీలు ఏర్పడడంతో సరఫరా ఆగిపోయింది. దీంతో పట్టణ ప్రజలు నీటి ఎద్దడితో ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై గ్రామ పంచాయతీ కార్యదర్శి శివకుమార్ గౌడ్‌ను వివరణ కోరగా పైప్‌లైన్ లీకేజీ కారణంగా నీటి సమస్య తలెత్తిందన్నారు. ప్రత్యామ్నాయంగా గ్రామ పంచాయతీ బోర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నప్పటికీ అన్ని ప్రాంతాలకు పూర్తి స్థాయిలో నీటి సరఫరా జరగడం లేదన్నారు. పైప్‌లైన్ల మరమ్మతులు చేపట్టి సజావుగా నీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



పూజలందుకున్న వాసవీమాత



పార్వతీపరమేశ్వరుల కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

## కల్యాణం.. కమనీయం

**కోవెలకుంట్ల:** పట్టణంలో వెలసిన వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో మహాకుంభాభిషేక వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. ముందుగా వేద పండితుల ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, నిజపాద దర్శనం, ప్రాతఃకాలపూజ, చక్రనవా వరణార్చన, జప అనుష్టానం, నగరేశ్వర స్వామికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, చతుర్వేదస్వస్తి, తదితర పూజలు జరిగాయి. అనంతరం రుద్ర, చండీ హోమాలు, చతుర్వేద వాహనం నిర్వహించారు. పట్టణంలోని భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. రాత్రి పార్వతీపరమేశ్వరుల గ్రామోత్సవం సాంస్కృతిక కార్యక్రమాల నడుమ అంగరంగ వైభవంగా జరిగింది.





వెంకట రామిరెడ్డి కాలనీలో రోడ్డుపై చేరిన మురుగు, ఆకుమల్ల మెయిన్ బజార్‌లో నిల్వవున్న మురుగు

## మురుగు పారదు.. సమస్య తీరదు!

**సంజామల:** ఆకుమల్ల గ్రామంలోని పలు కాలనీల్లో రోడ్డుపై మురుగు నిల్వచేరి దుర్గంధం వ్యాపిస్తోంది. గ్రామంలోని ఏరాసి వెంకటరామిరెడ్డి(తిప్ప) కాలనీలో కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో మురుగునీరు రోడ్డుపై చేరింది. ఆ రోడ్డుపై వెళ్లే పాదచారులు, వాహనదారులు జారి కిందపడిన సందర్భాలు ఉన్నాయి. అలాగే ఆకుమల్ల మెయిన్ బజార్ రోడ్డుపై మురుగునీరు నిల్వ చేరినా అధికారులు పట్టించుకోవడం లేదు. దోమలు వృద్ధి చెంది వ్యాధులకు కారణం అవుతున్నాయని ఆయా కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు.

## కనులపండువగా పల్లకీ సేవ



ఉత్సవ విగ్రహాలకు పల్లకీ సేవ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

**బనగానపల్లె రూరల్:** మండలంలోని యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం స్వామివారి పల్లకీ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఈఓ చంద్రుడు, అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం ఉమామహేశ్వరునికి అభిషేకం, అర్చన తదితర పూజలు చేశారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ముస్తాబు చేసి పల్లకీలో కొలువుంచారు. ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. కార్యక్రమంలో పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, యాగంటిపల్లె ఉపసర్పంచ్ బండి మౌలీశ్వరరెడ్డి పాల్గొన్నారు.